# పరగడుపు

నినాదాలలో సభాస్థలం హోరెత్తి పోతూ ఉంది. డప్పు బృందాలవాళ్ళు చిందు వేస్తున్నారు. తప్పెట కొట్టేవాళ్ళు శివాలుతొక్కుతున్నారు. పాడేవాళ్ళు పాడుతున్నారు. ఆడేవాళ్ళు ఆడుతున్నారు.

'ఇప్పుడు ముఖ్యమంత్రి మన ఏకైక కోర్కెతీర్చే వాగ్దానం చేస్తాడు' అని ప్రకటించిన కృష్ణ కుప్పకూలిపోయాడు.

ఆటలు ఆగాయి. పాటలు బంద్. సభ నిశ్శబ్దం! 'ఏమయింది?' 'ఏమయింది?'

కృష్ణ స్పృహతప్పి పోయాడు. అందరికీ ఆందోళన. మంత్రులకు, ముఖ్యమంత్రికి ఆరాటం, భయం.

'మైకులో ప్రకటన. కృష్ణకు ఏమీకాలేదు. మైకం కమ్మింది. డాక్టరు ఇక్కడే ఉన్నాడు. ముఖం మీద నీళ్లు చల్లారు. పరీక్షలు చేస్తున్నాడు. భయం లేదు. జనం ఆందోళన చెందనక్కరలేదు. కొంచెం సేపట్లో లేచి మాట్లాడతాడు!'

'అందాకా పాటలు వినండి'

'వద్దు! వద్దు! కృష్ణ మాట్లాడాలి.'

అందరూ ఉత్కంఠతో ఉన్నారు.

హోం మినిష్టరు లా అండ్ ఆర్డరుకు భయపడ్డాడు.

'సోదరలారా! సోదరీమణులారా! ప్రశాంతంగా ఉండండి. అంతా సవ్యంగా ఉంటుంది' హోం మినిస్టరును మాట్లాడనివ్వలేదు జనం. అరుస్తున్నారు. గోల!

'కృష్ణ జిందాబాద్!' 'కృష్ణ జిందాబాద్'

'కృష్ణ నాయకత్వం వర్ధిల్లాలి' 'కృష్ణ నాయకత్వం వర్ధిల్లాలి.'

సభ హోరెత్తిపోతూ ఉంది.

'జనం లక్ష ఉంటారా?' ఎవరో అడిగారు. 'పైమాటే రెండు లక్షలు?' ఉండవచ్చు.

ఎండమండిపోతూ ఉంది. బెజవాడ ఎండ! రోళ్లు పగలగొట్టే ఎండ.

కుర్చీల్లేవు., షామియానాల్లేవు. .జనం ఎండలో వున్నారు.

'ఉదయం పది గంటలకు' అన్నారు మహాసభ. ఒంటిగంటకు మినిష్టర్లు వచ్చారు. రెండు గంటలకు కృష్ణకు స్పృహ తప్పింది

జనం భోజనం చేయలేదు. ఎవరూ పోవటం లేదు. కూర్చోలేదు. అందరూ ఎండలో నిలబడ్డారు. ఓర్పు నశింపవచ్చు. పోలీసులు భయపడుతున్నారు.

'గాంధీ నెహ్రూ సభలకు కూడా ఇంతమంది జనం రాలేదు' అన్నారెవరో!

'ఆ రోజుల్లో ఇప్పుడున్నంత జనం ఈ చుట్ట పక్కల లేరు'

'నేనెరిగి ఏ రాజకీయ సభకు విజయవాడలో ఇంతమంది జనం రాలేదు' అని ఆశ్చర్యం ప్రకటించాడు పిల్లవాడు.

'ఎంత నీ వయస్సు?' ఎవరో ఎగతాళిగా నవ్వారు. పిల్ల కాక్కేంతెలుసు ఉండేలు దెబ్బ.

'ముఖ్యమంత్రులు పెట్టిన పార్టీ ప్రచార సభలకు జనం ఇందులో సగం కూడా రాలేదు'

'అంటే ఆ సభకు కోటికంటే ఎక్కువ ఖర్చుచేయలేక పోయారన్నమాట' చుట్టు ఉన్నవాళ్లలో నవ్వులు.

మైకులో ప్రకటన. 'కృష్ణ ఆరోగ్యం ముఖ్యం. హాస్పటల్‌కు తరలిస్తున్నాం. అంబులెన్సు వచ్చింది. ముఖ్యనాయకులు కృష్ణ వెంట ఉంటారు'.

'వద్దు! వద్దు! వద్దు! – ఇక్కడే వైద్యం చేయండి మీటింగు భగ్నం చేయవద్దు – మీ కుట్రలు మాకు తెలుసు. మీ జిత్తులు ఎత్తులు మాకు కొత్త కాదు' జనం అరుస్తూనే ఉన్నారు.

కృష్ణకు అంబులెన్సులో తీసుకుపోయే ప్రయత్నం మానేశారు. వేదిక హాస్పటల్ బెడ్ చేసి వైద్యం ప్రారంభించారు వైద్యబృందం వాళ్ళు. కృష్ణ బ్రతుకుతాడా? వైద్యం అందక చనిపోతాడా?

'కృష్ణకు బి.పి. ఉందా?' 'లేదు!' 'షుగర్?' 'లేదు!' 'వయస్సు?' 'నలభై లోపే!' 'పిల్లోడే!' 'చిన్నోడే!' 'ఏం జబ్బులున్నాయి?' 'ఏం జబ్బులూ లేవు!' 'మరెందుకు స్పృహ తప్పింది' 'తెలియదు!' 'గుండెపోటు కావచ్చునా?' 'కాకపోవచ్చు!' 'ఏమో' 'కావచ్చు'

సభ భయం గుప్పిట బిగిసిపోయింది. మంత్రులు ఆందోళన మధ్య అలజడిలో ఉన్నారు. పోలీసుల ఏ సమస్య ఎప్పుడు ఉత్పన్నం అవుతుందో అని వణికి పోతున్నారు.

మునిసిపాలిటి వాళ్ళు నీళ్ళ పాకెట్లు ఏర్పాటు చేశారు. ఏవో సేవా సంస్థల పెరుగన్నం

పొట్లాలు పంచుతున్నారు. చాలవు. ఎగబడటం లేదు జనం. గలాటా లేదు. కావాలని కూడా ఎవరూ పోవటం లేదు.

జనం పల్లెల నుంచి, మండలాల నుంచి సాధ్యమైన ప్రయాణ సౌకర్యాలతో వస్తూనే ఉన్నారు. మైదానం కిక్కిరిసి పోతూ ఉంది. చెట్టుమీద, చుట్టు పక్కలున్న ఇళ్ళ మీద జనం నిలబడి ఉన్నారు.

ఎండలు మండుతూనే ఉన్నాయి.

మునిసిపల్ మైదానంలో సభలు సమావేశాలు పెట్టుకోవటానికి ఎవరూ ఎవరికీ రెంట్ చెల్లించనక్కరలేదు. కాని పర్మిషన్ తీసుకోవాలి. తీసుకొన్నారు.

ఎవరికీ కూలీ ఇచ్చే పనిలేదు. వాహనాలు ఏర్పాటు చేసుకొని ఎవరికి వాళ్ళే వచ్చారు.

కృష్ణతో ఉండే జనం తిరిగే వాహనాలు స్థానికుల సహాయంతో వాళ్ళే ఏర్పాటు చేసుకున్నారు.

సభలో కుర్చీలు, బేరికేడ్‌లు, షామియాను వేయలేదు. ఖర్చులేదు.

వేదిక పర్మినెంట్ రాతి కట్టడం అలంకారాలు లేవు. ఖర్చులేదు.

వేల సంఖ్యలో వాల్‌పోస్టర్లు అంటించారు. దాని ప్రింటింగుకు, అతికించటానికి ఖర్చు అవుతుంది. కృష్ణ ఫోటో చుట్టుప్రక్కల చంద్రహారంలాగా పాతికమంది ఫోటోలు ముద్రించుకొన్నారు. వాళ్ళు అంతో ఇంతో ఖర్చు భరించగల వాళ్ళే! లేదా బిచ్చమెత్తి తెచ్చి ఖర్చు చేశారు.

వాళ్ళు ఉండే ఆర్.బి. గెస్ట్ హౌస్‌ల్లో రూంల రెంటు నామమాత్రం!

'పైసా ఖర్చు లేకుండా, ఒక్క కేకతో ఇంతమంది జనం సభకు వచ్చేట్టు చేయడం కృష్ణకు తప్ప మరొకరికి సాధ్యం కాదు!' ఎవరిదో ప్రకటన.

ఎట్లా సాధ్యమయింది? ఊరూరా కాలినడకన తిరుగుతాడు. ఉంటే తింటాడు. లేకపోతే పస్తుంటాడు. సైకిల్ మీద ప్రయాణిస్తాడు. ఎవరైనా టిక్కెట్టు కొని ఇస్తే రైల్లో బస్లో పోతాడు. రమ్మంటే వచ్చి కారులో కూర్చుంటాడు.

డబ్బు ఎవరిచ్చినా తీసుకోడు. ఎవరు ఎంత తనకోసం తనలక్ష్యం కోసం ఖర్చు చేస్తున్నా కాదనడు. పట్టించుకోడు.

అతని కోర్కె! మా వాళ్ళకు అన్నం తినే హక్కు ఉంది. దానిలో ఎవరూ దుమ్ము వేయవద్దు. బలహీనుల్లో నా తల్లిదండ్రులు అన్నదమ్ములు అక్క చెల్లెళ్ళు మరీ బలహీనులు

అమాయకులు. తరతరాలుగా మోసపోయారు. ఇంకా మోసపోరాదు. అది అతడి నిశ్చయం దాన్ని ఈ అణగారిన జనం నమ్మారు.

ఇతని మాట ఇంతమంది జనం వింటారని, వెంట ఉంటారని నమ్మిన రాజకీయ పార్టీలు కృష్ణను తను పార్టీలో చేర్చుకొనే ప్రయత్నం తీవ్రంగా చేశాయి.

భయపెట్టారు. బెదరలేదు

బతిమాలారు. వినలేదు

జైలో పెడతారు. రడీ

చంపుతారు. రడీ

చివరికీ ఏం కావాలన్నారు. 'మా వాళ్ళకు అన్నం, నీళ్ళు, ఇల్లు, వాకిలి, చొక్కా నిక్కరు, విద్య, ఉద్యోగం,' కావాలన్నాడు.

'అవి తీరే మార్గం ఉంది?' ఏమిటది?' 'యం.పి.కా' 'వద్దు!' 'యం.యల్.ఏ కా!' 'వద్దు' 'యం.యల్.సి.కా' 'వద్దు! 'నీకు ఇల్లూ వాకిలీ పొలం పుట్రా, బెంకు చెక్కుబుక్కు' 'వద్దు!'

ఈ వద్దన్న, అంటున్న, అనే కృష్ణ జనానికి ఇష్టం. అతడి మీద వీళ్ళకు నమ్మకం. అతడి పిలుపుకు ఇంత ప్రతిస్పందన.

మైకులో ప్రకటన 'కృష్ణ ఆరోగ్య పరిస్థితి బాగుంది. ప్రమాదం ఏమీలేదు. కళ్ళు తెరచి చూసి సభను కానివ్వమన్నాడు. అతను లేవబోయాడు. డాక్టర్లు వద్దు పడుకోమన్నారు. సెలైన్ ఎక్కిస్తున్నారు'

జనం నిశ్శబ్దంగా వున్నారు.

హోంమంత్రి మాట్లాడబోయాడు. జనం అరిచి గగ్గోలెత్తి పోయారు.

ముఖ్యమంత్రి సభనుద్దేశించి ప్రసంగించబోయాడు. జనం గోల చేసి అడ్డుకొన్నారు.

'కృష్ణ మాట్లాడాలి' 'కృష్ణ మాట్లాడాలి'

'కృష్ణ జిందాబాద్' 'కృష్ణ జిందాబాద్'

'కృష్ణ వర్ధిల్లాలి! 'కృష్ణ వర్ధిల్లాలి.'

సభ మార్మోగిపోతూ ఉంది. కృష్ణ వేదిక మీద పడుకొనే ఉన్నాడు. లేవబోయాడు. నీరసంగా ఉంది. డాక్టర్లు లేవనీయలేదు.

రెండు రాత్రుల నుంచి క్షణం కూడా నిద్రపోలేదు.

గెస్టుహౌస్ రూంల నిండా కార్యకర్తలున్నారు.

మీటింగుకు జిల్లాల నుంచి వస్తున్న జనం. ఏర్పాట్లు, ముందుగా వచ్చినవాళ్ళు కృష్ణను కలిసి చెబుతున్నారు.

'మన కోర్కె నెరవేరుతుంది' అందరికీ హామీ ఇస్తున్నాడు. సభ జయప్రదంగా జరగాలి' హెచ్చరిస్తున్నాడు 'ఏ రకంగా ఘర్షణలు జరగరాదు' సూచిస్తున్నాడు. 'సభను చెడగొట్టేవాళ్ళుంటారు జాగ్రత్తగా పరిశీలించండి' వివరిస్తున్నాడు.

వస్తున్న జనాల కష్ట సుఖాలు అడిగి తెలుసుకొంటున్నాడు. అవాంతరాల గూర్చి ప్రశ్నిస్తున్నాడు. ఏమేం చేయాలో చెప్పి, తన కార్యకర్తల్ని పనికి పురమాయిస్తున్నాడు. ఏర్పాట్లు గురించి వివరాలు తెలుసుకొంటున్నాడు.

అదే షర్టు. అదే పేంటు. అదే నల్లటవలు వాటితోనే సంప్రదింపులు, పడక, మాటలు, చేతలు కూర్చున్నా లేచినా అవే బట్టలు. మార్చుకోలేదు.

జనం ఉత్సాహంగా ఉన్నారు. ఉద్వేగంతో వస్తున్నారు. మాట్లాడించి పోతున్నారు.

కృష్ణ ఉల్లాసంగా ఉన్నాడు. మానసికంగా పొంగి పోతున్నాడు. శారీరకంగా డస్సిపోయి ఉన్నాడు. శారీరక అసౌకర్యం మానసిక సుఖం వల్ల మరుగున పడిపోతూ ఉంది.

వచ్చేపోయే వాళ్ళతో మాట్లాడుతూ వింటూ సూచనలిస్తూ సభ విజయం కోసం ఆరాటపడుతున్నాడు కృష్ణ.

నిన్న రాత్రి సారొచ్చాడు. సారొచ్చాడు అని కృష్ణ చుట్టూ కాపలాగా ఉండేవాళ్ళు కేకలు పెట్టారు.

కృష్ణ రూంలోంచి బయటికి వచ్చాడు. సార్‌ని చూశాడు. నమస్కరించాడు. కౌగిలించుకొంటే కౌగిలిలో పసిపిల్లవాడిలాగా వొదిగిపోయాడు. సార్ తెల్ల తల కృష్ణ నల్ల తలను కప్పేసింది.

'నాన్నా! నన్ను ఆశీర్వదించు!'

'నాయనా నిన్ను విజయం వరిస్తుంది. నీ నుదుటి సూర్యుడు కాంతి అన్నంలేని కోటిమంది ముఖాలలో అన్నమై వెలుగుతుంది. నువ్వు చరిత్ర సృష్టిస్తున్న చిరంజీవివి నీకు తిరుగుండదు.'

కృష్ణసార్‌ను వాటేసుకొనే ఉన్నాడు.

'భగవంతుడా! మా బిడ్డను ఆశీర్వదించు. కాపాడు. పోరాడే బలం అనుగ్రహించు' అన్నాడు.

జారిపడ్డాయి.

'నాయనా నవ్వు విజయం సాధిస్తావ్! శుభం!' అని పక్కనున్న వాళ్ళతో 'అన్నను కాపాడండి' అన్నాడు. 'ఓ!' అన్నారు వాళ్ళు.

'నాయనా నువ్వు అన్నం తిన్నావా?'

'నాన్నా! మా తండ్రీ! నీది తల్లి మనస్సు. నేను అన్నం తినలేదు. తినలేను. తింటే నిద్ర వస్తుంది. నేను నిద్రపోరాదు. నిద్రపోతే ఏ ఏర్పాటుకు ఏ లోపం వస్తుందోనని భయం. నిద్రలేని రాత్రులు నాకు అలవాటే! భయం లేదు.'

'నీకు భయం లేదు. కాని మాకు భయం. పాలు అయినా తాగు'. 'సరే'! సార్ వెళ్ళిపోయాడు. పెద్దాయన పోతున్న దిక్కుగా భక్తితో చూశాడు కృష్ణ.

మళ్ళీ పని. మళ్ళీ సంప్రదింపులు. సలహాలు సూచనలు వినటం చెప్పటం.

వచ్చేవాళ్ళు, వెళ్ళేవాళ్ళు ఎవరూ అన్నం తిన్నావా అనిగాని, స్నానం చేశావా అని గాని, నిద్రపోయావా అనిగాని అడగలేదు. అవన్నీ వాళ్ళకు చిన్న చిన్న సంగతులు. నాయకుణ్ణి ఇటువంటివి అడగటం చెప్పటం వినటం అవమానం.

సభ విజయం కోసం జరిగే ఏర్పాట్లు క్షణక్షణం అడిగి తెలుసుకొంటున్న కృష్ణ తనను గూర్చి తాను ఆలోచించుకోలేకుండా ఉన్నాడు.

ఏర్పాట్లు అన్నీ బాగున్నాయని ముఖ్యమంత్రితో సహా ఆరుగురు ముఖ్యమైన మంత్రులందరూ వస్తున్నారని ముఖ్యమంత్రి జనం కోరే హామీ ఇస్తారని కృష్ణకూడా జనంతో పాటు ఆసక్తిగా ఉండి, పదిగంటలకే వేదిక వద్దకు వచ్చి కింద కూర్చుని ఉన్నాడు.

మంత్రులు రాగానే అందరినీ వేదిక మీదకి కృష్ణ ఆహ్వానించాడు. పూల మాలలు లేవు. షాల్లులేవు. బొకేలు లేవు. షేక్‌హేండ్‌లు లేవు. పదే కుర్చీలున్నాయి. పాతికమంది ముఖ్యులే నిలబడ్డారు. వందలమంది పోలీసులు బందోబస్తు చేస్తున్నారు. అంతా ఉత్కంఠ!

కృష్ణ లేచి నిలబడ్డాడు. ఉద్యమ చరిత్ర అందరికీ స్పష్టంగా చెప్పాడు. తమ ఒకే ఒక్క కోర్కె చెప్పాడు. మా కోర్కె తీర్చమని ప్రభుత్వాన్ని అడిగాడు. 'ఇప్పుడు ముఖ్యమంత్రి మన ఏకైక కోర్కె తీర్చే వాగ్దానం చేస్తాడు.' అంటూ కుప్పకూలిపోయాడు.

'కృష్ణ మాట్లాడాలి. కృష్ణ మాట్లాడాలి' అంటూ జనం గోలచేస్తున్నారు.

'నేను లేచి మాట్లాడతాను' అని వైద్యుల్ని అడిగాడు కృష్ణ.

'మాట్లాడనివ్వండి' అన్నాడు ముఖ్యమంత్రి.

కృష్ణ లేచి నిలబడ్డాడు. డాక్టర్లు ఇద్దరు అతణ్ణి పట్టుకొన్నారు. ఒక డాక్టరు సెలైన్ బాటిల్ పట్టుకొని నిలబడ్డాడు.

'అన్నకేమయింది? కృష్ణ కేమయింది?'

'మా నాయకుడికి ఏమయింది?' జనం అల్లాడిపోతున్నారు.

'అన్నదమ్ముల్లారా అక్కచెల్లెళ్ళలారా, తల్లిదండ్రులారా!' అని కృష్ణ సంబోధించాడు.

జనం హోరు చప్పట్లు!

'నీకేమయింది? ఏం కష్టం? ఏం ప్రమాదం?' జనం గగ్గోలెత్తి పోతున్నారు.

'నాకేం కాలేదు. నీరసం అంతే! మనకు నీరసం లేకపోతే ప్రమాదం కాని, నీరసం ఉంటే అంతా సుఖంగా ఉన్నట్లే!'

జనం హోరు. చప్పట్లు.

'ముఖ్యం ముఖ్యమంత్రి హామీ మనందరికి కావాలి. అందుకే నిరీక్షిస్తున్నాం అందుకే ఆశిస్తున్నాం. ఇప్పుడు ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ హామీ ప్రకటిస్తారు!' సభ హోరు చప్పట్లు.

కృష్ణ కుర్చీలో కూర్చున్నాడు. డాక్టర్లు చెరోపక్క నిలబడి ఉన్నారు. మరో డాక్టరు సెలైను బాటిల్ పట్టుకొని ఉన్నాడు. సెలైన్ ఎక్కిస్తూనే ఉన్నాడు.

ముఖ్యమంత్రి ముఖ్య విషయం ప్రకటించాడు.

'మూడు నెలల్లో మీ కోర్కె తీరుస్తాను. రాష్ట్ర ప్రభుత్వమే తీరుస్తుంది మా పార్టీ తీరుస్తుంది కేంద్రప్రభుత్వం కూడా తీరుస్తుంది. మీ వాంఛ మూణ్ణెల్లలో తీరుతుంది.'

'నమ్మం. నమ్మం.నమ్మం' జనం గగ్గోలు.

'నా మాట నమ్మండి. నేను మాట తప్పను.'

'మూడే నెలలు!'

'నమ్మం. నమ్మం. నమ్మం.' సభవేదన.

కృష్ణ నెమ్మదిగా లేచి 'ముఖ్యమంత్రి మాట నమ్ముదాం! మూడు నెలల సమయం ఇద్దాం!'

'మోసపోతాం! మోసపోతాం! మోసపోతాం!' సభ గగ్గోలెత్తి పోతూ ఉంది.

'తర తరాలుగా మోసపోయాం. స్వాతంత్ర్యం వచ్చినా మోసపోతూనే ఉన్నాం. శతాబ్దాలుగా మోసపోయిన మనం మూడు నెలలు ఆగుదాం!'

'సరే, నీ యిష్టం! జాగ్రత్త! మోసపోవద్దు! సరే! సరే! సరే! తప్పకూడదు. తప్పితే ముఖ్యమంత్రి కుర్చీ తగలబడి పోతుంది. మూడునెలల్లో మీ మాట మీరు నిలబెట్టుకోండి.'

సభ గోలతో హోరెత్తిపోయింది. 'ముఖ్యమంత్రికి మూడు నెలలు సమయం ఇవ్వటం మీకిష్టమైతే మీ ఆమోదం తెలుపుతూ మీ కుడి చేతుల్ని ఎత్తి చూపండి.'

సభ మొత్తం కుడిచేయి అయింది. చేతులు తప్ప మరేం కనిపించలేదు.

'ముఖ్యమంత్రులు, మంత్రులు వెళతారు. మీరు మీ హర్షంతో చప్పట్లు కొడుతూ వాళ్ళను సాగనంపండి'

'కాదు! కాదు! కాదు, మీకేమయింది? ఏం జరిగింది? ఏమయిందో చెప్పాలి. మీ ఆరోగ్యం వివరించండి!

డాక్టర్లతో ముఖ్యమంత్రి 'చెప్పండి' అన్నాడు.

హాస్పటల్ సూపరింటెండెంట్ ముందుకు వచ్చి సభకు నమస్కరించి చెప్పాడు. 'మీ నాయకుడికి ఏ జబ్బూ లేదు. నీరసం వల్ల పడిపోయాడు. నిద్రలేక, విశ్రాంతి లేక నీరసం వచ్చింది. మీరెవరూ కృష్ణ అన్నం తిన్నడో లేదో చూడలేదు. మీరు కడుపునిండా అన్నం తినాలని అతను ఆరాట పడుతున్నాడు. అయితే కడుపునిండా అన్నం తినలేదు.

అసలు అయిదు రోజుల్నుంచి అన్నమే తినలేదు.

సభలో శబ్దం లేదు. పూర్తి నిశ్శబ్దం. నిశ్శబ్దం తల వంచుకొంది. ఆ నిశ్శబ్దంలో వేదిక నిర్మానుష్యమయింది. సభ కదలలేదు. స్తంభించిపోయింది.